క్లుప్తంగా

మెగా ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తున్న మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి కోరారు. ఆయన సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాక్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో 15 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు హాజరుకావొచ్చని చెప్పారు. వివిధ కంపెనీల ద్వారా 1,300 ఉద్యోగాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

పిచ్చాటూరు: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం నాగలాపురం మండలం ఎస్ఎస్ పురం జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నేతాజీ చిత్రపటాన్ని ఉంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు భూపాల్ విద్యార్థులకు నేతాజీ జీవిత చరిత్రను వివరించారు.

వ్యాసరచన పోటీలు రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని అమరావతి జూనియర్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్టు, కళాశాల యాజమాన్యం తెలిపింది. అలాగే చిత్రలేఖనం, పోస్టర్ ప్రజెంటేషన్‌పై పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించింది. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు పసుపులేటి కిషోర్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ ప్రసూన, ప్రిన్సిపల్ రాజేష్, డైరెక్టర్ వంజవాకం కల్పన పాల్గొన్నారు.

దుస్తులు..ఆహారం పంపిణీ



అన్నదానం చేస్తున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి

రేణిగుంట: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న అభాగ్యులకు ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి చేతులమీదుగా దుస్తులు, ఆహారం అందజేశారు. ఎంపీడీఓ హరిబాబు తన తల్లి జ్ఞాపకార్థం ఏటా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎంపీపీ కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కుక్కలగుంటలో ఫ్యామిలీ డాక్టర్



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని కుక్కలగుంటలో సోమవారం పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలందించారు. 45 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగులను వారి ఇంటికే వెళ్లి చికిత్సలందించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటతేజ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేలా సైన్స్ పరిశోధనలు

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న పెను సవాళ్లను పరిష్కరించే విధంగా సైన్స్ పరిశోధనలు నిర్వహించాలని నెల్లూరు జిల్లా విక్రమసింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా కోవిడ్‌తోపాటు అంతుచిక్కని వ్యాధులు విజృంభిస్తున్నాయని, వాటిని ఎదుర్కోవాలనే కోణంలో పరిశోధనలు చేపట్టాలన్నారు. క్లస్టర్ వర్సిటీ వీసీ సాయిగోపాల్, బుడ్డోల్ల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ విశ్వనాథ్, నేషనల్ వర్క్‌షాప్ కన్వీనర్ శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

ఐసీఏఐ భవన నిర్మాణానికి భూమి పూజ

తిరుపతి కల్చరల్: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి బ్రాంచి భవన నిర్మాణానికి సోమవారం కరకంబాడి రోడ్డులోని తుడా క్వార్టర్స్ సమీపంలో భూమి పూజ చేశారు. ఇందులో ఐసీఏఐ అధ్యక్షుడు డాక్టర్ దేబా షీస్ మిత్ర, ఉపాధ్యక్షుడు అనికెట్‌సునిత తలాతి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ఈ భవనం సీఏ చేయాలనే ఆకాంక్ష కలిగి విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఐసీఏఐ సభ్యులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించే దిశగా సదస్సులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..

సమస్యలు పరిష్కరిస్తూ..

- పేదరికమే ప్రామాణికంగా సంక్షేమం
- అర్హులందరికీ పథకాలు
- ప్రజాసేవే పరమావధిగా పాలన
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



మళ్లీ మీరే రావాలయ్యా !

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం దయనీడు గ్రామంలో పర్యటించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డితో "గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేని చూడాలంటే ఐదేళ్లు పట్టేది. ఇప్పుడు మీరు మాకు ఎప్పుడు అందుబాటులో ఉంటున్నారు. బాగా తిరుగు.. జనం కష్టాలు పట్టించుకో.. ఈసారి కూడా జగన్‌మోహన్ రెడ్డే సీఎం కావాలి.. మీరే ఎమ్మెల్యే కావాలి" అంటూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని ఆశీర్వదిస్తున్న మహిళ వసంతమ్మ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): ప్రజాసేవే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని దైనేడు, మామిడిగుంట, పిల్లమేడులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అవ్వాతాతల యోగ క్షేమాలను విచారిస్తూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా.. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎవరికైనా అర్హత ఉండీ పథకం అందకపోతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఒక్క పేదవాడు కూడా నష్టపోకూడదని స్పష్టం చేశారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకం అందాలంటే జన్మభూమి కమిటీ దయాదాక్షిణ్యాలు కావాల్సి వచ్చేదని, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులను వెతుక్కుంటూ ఇంటి ముంగిటకే పథకాలు వస్తున్నాయని వివరించారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అర్చనా దేవి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, నేతలు మునిరత్నం, మాజీ ఎంపీపీ చంద్రయ్య నాయుడు, భాస్కర్, సర్పంచ్ మణి, ఎంపీటీసీ సభ్యుడు గురుమూర్తి, జగదీష్, ధనంజయ, రవి, రుద్రయ్య, నాగరాజు, గంగయ్య, రాఘవయ్యా, ఆనంద్, లోకేష్, శివానంద, భాస్కర్, రమణ, సుబ్రమణ్యం, గురవయ్య, అంజూరు రఘురామయ్య, యుగంధర్, మణి, ప్రసాద్, భక్తవత్సలం, గంగాధరం, రాజేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

తొట్టంబేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఎం.అమ్ములు సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వెంటనే వారి గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు

పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వేదికపై బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి : పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తామని ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆడిటోరియంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యాసంస్థల అధినేతలు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. పవిత్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా తన పేరును ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచించారని వెల్లడించారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు



చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ ధనుంజయ రెడ్డి

పిచ్చాటూరు: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని డీడీఏ ధనుంజయరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిరాజుకండ్రిగలో సోమవారం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సజ్జ సాగు చేసిన రైతులకు హెక్టార్‌కు విత్తన శుద్ధి మందులతో పాటు ఇతర పురుగు మందులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. సివిల్ సప్లయి ద్వారా 100 శాతం బైప్యాక్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాదిని ప్రధాని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం వల్ల గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో నాలుగు ఎకరాలు చిరుధాన్యాలను పండించవచ్చన్నారు. సత్యవేడు ఏడీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ మే, జూన్ నెలల్లో చిరుధాన్యాలు చల్లుకుంటే పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. చిరుధాన్యాలు తినడం వల్ల బ్లడ్ షుగర్ తగ్గుతుందని, ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్య రాదని, కొన్ని రకాల క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. ఏఓలు సంజీవ రెడ్డి, శ్రీను, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న రవిమణి

ఏర్పేడు : గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులను చదువులో సహకరించి ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఐఎల్‌పీ ప్రతినిధి రవిమణి తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దఅంజిమేడు ప్రాథమికోన్నత, మేర్లపాక ప్రాథమిక పాఠశాలల్లో ప్రజా ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించనున్నట్లు వివరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రవేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్లు చంద్రశేఖర్, సుస్మిత, ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, సంజీవయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి అంబూరు కామాక్షమ్మ ఆలయ కుంభాభిషేకం



నూతనంగా నిర్మించిన కామాక్షమ్మ ఆలయం

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో నిర్మించిన కామాక్షమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం నుంచి గురువారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సాయిరెడ్డి, ఆలయ ప్రధాన నిర్మాణ దాత ప్రసన్నకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, వాస్తు హోమం, యాగశాల పూజతో కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

న్యాయవాది తల్లి మృతికి సంతాపం



ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : శ్రీకాళహస్తికి చెందిన న్యాయవాది చెంబేటి ప్రభాకర్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వెంటనే వారి ఇంటికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయవాది, కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, రత్నం రెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు రోడ్డు భద్రతపై బైక్ ర్యాలీ

శ్రీకాళహస్తి: పట్టణంలో రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంవీఐ బి.దామోదరనాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొననున్నట్లు వెల్లడించారు.

ముక్కంటి సేవలో విశ్రాంత డీజీపీ



ధ్వజస్తంభం వద్ద భాస్కరరావు, కుటుంబసభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం తెలంగాణ విశ్రాంత డీజీపీ ఎంవీ భాస్కరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సతీష్‌మాలిక్, శ్రీనాథ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై బాలికలకు అవగాహన



మాట్లాడుతున్న జయచంద్రనాయుడు

రేణిగుంట : ఆరోగ్య రక్షణపై కిశోర బాలికలను సోమవారం స్థానిక పీహెచ్‌సీలో అవగాహన సదస్సు నిర్వహించారు. రాస్ ప్రాజెక్టు అధికారి జయచంద్రనాయుడు మాట్లాడుతూ బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్యాధికారి ఛత్రప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించేందుకు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. రాస్ బాలాజీ, బాలవికాస్ సభ్యులు పాల్గొన్నారు.

అప్రూవల్‌పై అభ్యంతరాలకు గడువు



అధికారులతో కమిషనర్ బాలాజీనాయక్

శ్రీకాళహస్తి : తుడా అప్రూవల్ చేసిన ఇన్ ప్రిన్సిపల్ లేఅవుట్ ప్యాట్రన్స్‌పై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 15రోజులోపు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సర్వే నెం:127/8(పి), 128/5, 6, 7, 8(పి), 128/9(పి), 141/1(పి), 141/2, 141/5(పి), 141/6, 147/4(పి), 148/3(పి), 148/4, 148/5(పి), 148/6(పి), 129/2, 3, 132/9, 8, 4, 6, 135/1లో భూమికి లేఅవుట్ రెగ్యులరైజేషన్ కింద తుడా వారు అప్రూవల్ చేశారన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే పురపాలక కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

చిరస్మరణీయులు 'నేతాజీ'



బండారుపల్లెలో నేతాజీ చిత్రపటానికి పూజ చేస్తున్న రామచంద్ర రాజు

ఏర్పేడు : మండలంలోని పలు పాఠశాలల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం బండారుపల్లె, మోదుగులపాలెం, మన్నసముద్రం, ఏర్పేడు, పల్లం, పాపానాయుడుపేట, కందాడు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు చిరస్మరణీయంని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు రామచంద్ర రాజు, గిరిధర్ రాజు పాల్గొన్నారు.

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : మండలంలో పెన్నలపాడు ప్రాథమిక పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేసి ఆంగ్లేయులపై పోరాడిన ధీశాలి నేతాజీ అని కొనియాడారు.

26న హోమియోపతి వైద్యశిబిరం



వైద్య శిబిరం ప్లకార్డులను ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

కేవీబీపురం: మండలంలోని కాట్రపల్లిలో 26వ తేదీన తేజో భారత్ కార్యక్రమం కింద ఉచిత మెగా హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ, వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా హోమియోపతి మందులు అందజేస్తారని తెలిపారు. మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, నాయకులు నందకుమార్, సర్పంచ్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి కల్చరల్: మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు మబ్బు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న విక్రమ్ హోటల్ హాల్లో సోమవారం మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణను రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం ప్రారంభించారు. వెంకటరత్నం మాట్లాడుతూ సమాజ సేవ జీవిత సార్థకతకు మార్గదర్శకమన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే ట్రస్ట్ ఏర్పాటు చేశానని తెలిపారు. ఇందులో భాగంగా మహిళలకు గ్రూపుల వారీగా ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాజశేఖర్, సూర్యనారాయణ సతీమణి మబ్బు రాజ్యలక్ష్మి ట్రైనర్ రాజేశ్వరి పాల్గొన్నారు.